క్లుప్తంగా

అనుమతులు తప్పనిసరి

సఖినేటిపల్లి: వినాయక ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ కె.దుర్గా శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు, విద్యుత్ మైక్ పర్మిషన్ల కోసం ముందుగానే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఉత్సవాల పేరిట రాత్రి సమయాల్లో రికార్డింగ్ డాన్సులు, చట్ట విరుద్ధమైన పనులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండపాల పూర్తి భద్రత ఆలయ కమిటీ నిర్వాహకులే వహించాలన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గ్రామ పంచాయతీ వద్ద 100 మంది పేదలకు సాయం అందజేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలకు గాను సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు రూ.15 వేలు ట్రస్ట్‌కు విరాళంగా అందజేశారని ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎ.మధురాజు, బళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు రోజూ కాలినడకన వస్తున్న ఆరో తరగతి విద్యార్థి పిల్లి వెంకట సత్యనారాయణకు గ్రామానికి చెందిన ఎన్నారై మహేష్ సహకారంతో సైకిల్ సమకూర్చారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు నల్లి సుధీర్, విద్యార్థి సంఘాల ముఖ్య సలహాదారుడు తాడి సహదేవ్, పాఠశాల హెచ్ఎం జె.సుగుణ చేతుల మీదుగా విద్యార్థి సత్యనారాయణకు గురువారం సైకిల్ అందజేశారు.

నేలకొరిగిన భారీ వృక్షం

అంబాజీపేట: మాచవరం పెచ్చెట్టివారిపాలెం సమీపంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డుకి అడ్డంగా పడిపోయిన వృక్షాన్ని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కుమార్‌కు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సమాచారం అందించారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

కొత్తపేట: వినాయక చవితి పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో, నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్ఐ జి.సురేంద్ర ఉత్సవ కమిటీలకు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయకుని మండపాలకు, కార్యక్రమాలకు ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ నుంచి అనుమతులు పొందాలన్నారు. నవరాత్రుల సమయంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టపర్తి, లదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు.

మట్టి గణపతి మనసా స్మరామి

- రేపు వినాయకచవితి
- ఈసారి అత్యధికంగా మట్టి గణపతి విగ్రహాలే

కొత్తపేట: భక్తుల చేత పూజలు అందుకునేందుకు పార్వతీనందనుడు చవితికి సిద్ధమయ్యాడు. వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా వాడవాడలా గణనాథుడిని కొలువుదీర్చేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. అయితే గతంలో కంటే భిన్నంగా ఈసారి పర్యావరణ హితకారిగా మట్టి గణపయ్యలనే కొలువుదీర్చేందుకు ఉత్సవ కమిటీలు ముందుకు వచ్చాయి. శనివారం నుంచి గణపతి నవరాత్రులు ఘనంగా ప్రారంభం కానున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా నిర్వహించే ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆయా పందిర్లలో ప్రతిష్ఠించే వివిధ ఆకృతుల గణపతి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కంటికి అందంగా కనిపించే ఈ విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ) వినియోగించడం వల్ల పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో పర్యావరణ హితకారిగా ఉండే బంకమట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని పర్యావరణ ప్రేమికులు, సామాజిక వేత్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఉచితంగా మట్టి గణపతుల ప్రతిమలను ప్రజలకు అందజేస్తున్నారు.

పీఓపీతో పొంచి ఉన్న ప్రమాదం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)తో తయారుచేసే విగ్రహాల ద్వారా పర్యావరణానికి తీరని ముప్పు అని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. విగ్రహాల అలంకరణకు ఉపయోగించే రసాయనిక రంగులు మరింత ప్రమాదకరం. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆ విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత నీటిని కలుషితం చేయడమే కాకుండా అనేక రోగాలకు మూలం అవుతున్నాయి. నీటిలో ఉండే జలచరాలు నశించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. పీఓపీ విగ్రహాల తయారీలో వినియోగించే జిప్సం, గంధకం, మెగ్నీషియం, సీసం లాంటి రసాయనాలు అత్యంత ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మూలకాలు సాధారణంగా నీటిలో త్వరగా కరగవని, వీటి ప్రభావం మనుషులపైనే కాకుండా వృక్షాలపై. జంతువులపై కూడా ప్రభావం చూపుతాయన్నారు. రసాయనాలు కలిసిన నీటిని వినియోగిస్తే ఊపిరితిత్తుల సమస్యలతో పాటు చర్మ, కంటి సమస్యలు కూడా వస్తాయంటున్నారు. అందుకే ప్రజలందరూ ఇంటింటా పీఓపీతో చేసిన గణపయ్యలను కాకుండా మట్టితో చేసిన గణనాథులను పూజించాలని సూచిస్తున్నారు.



కొత్తపేటలో సిద్ధం చేసిన మట్టి విగ్రహాలు

మట్టి విగ్రహాలనే పూజించాలి



పీఓపీ, కెమికల్స్‌తో తయారుచేసే విగ్రహాలను ప్రతిష్ఠించడం వల్ల పర్యావరణం కలుషితం అవుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ వినాయక చవితికి మట్టి విగ్రహాలనే వినియోగించాలి. ఏకో ఫ్రెండ్లీ ప్రతిమలను ఇంట్లోనే తయారుచేసుకోవొచ్చు. అవి అందంగా ఉండాలంటే మనం ఇంట్లో ఉపయోగించే సహజసిద్ధమైన పసుపు, కుంకుమ వంటి వాటితో అలంకరించుకోవాలి. దీనిపై విద్యార్థుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.హేమలత, లెక్చరర్, బోటనీ విభాగం, వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట

5 వేల విగ్రహాలు పంపిణీ చేస్తున్నాం



ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ) విగ్రహాల తయారీలో వినియోగించే రసాయనాలు అత్యంత ప్రమాదకరం. వాటిని నిమజ్జనం చేశాక పర్యావరణానికి తీరని ముప్పు కలుగుతుంది. అందుకే పర్యావరణ పరిరక్షణకు మా వంతుగా జిల్లాలోని అయినవిల్లి, వానపల్లి, మడుపెల్ల, కొత్తపేట, వాడపాలెం తదితర ప్రాంతాల్లో 5 వేల విగ్రహాలు పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వినియోగించాలని ప్రచారం చేస్తున్నాం.

– సింగిరెడ్డి గోవిందుస్వామి, ధర్మసూత్ర గ్రూపు, వాడపాలెం, కొత్తపేట మండలం

డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయాలి

అంబాజీపేట: రోజుల తరబడి జ్వరంతో బాధపడుతున్న రోగులను గుర్తించి అమలాపురం ఏరియా ఆస్పత్రిలో డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ భరతలక్ష్మి అన్నారు. కె.పెదపూడిలో ముక్కామల వైద్యాధికారి ఎ.ఇంద్రావతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ డెంగ్యూ చికిత్స పొందుతున్న రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఫీవర్ సర్వే సమగ్రంగా చేసి జ్వర పీడితులను గుర్తించాలన్నారు. అవసరమైన వారికి స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం డెంగ్యూ బారినపడిన రోగుల ఇళ్లను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతంలో పంచాయతీ అధికారుల సహకారంతో యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించాలన్నారు.

సఖినేటిపల్లి రేవు నిలుపుదల

సఖినేటిపల్లి: మాధవాయిపాలెం ఫెర్రీగా ప్రభుత్వ గుర్తింపు పొందిన సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో పంటు సేవలను గురువారం నుంచి అధికారులు నిలుపుదల చేశారు. గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు రక్షణగా ఈ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు నర్సాపురం రేవు పాటదారులకు పశ్చిమగోదావరి జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు: మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నేత యాండ్ర వీరబాబును గురువారం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవితో పాటు పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. మాకనపాలెంలో వీరబాబును కలిసి సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, నెల్లి దుర్గాప్రసాద్, జక్కంపూడి వాసు, భూపతి దామోదరరావు, తులా గోపాలకృష్ణ, మట్టపర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పీఈటీకి సత్కారం



మాస్టారును సత్కరిస్తున్న క్రీడాకారుల సంఘం సభ్యులు

కొత్తపేట: రిటైర్డ్ పీఈటీ నల్లా సత్యనారాయణమూర్తిని కోనసీమ జిల్లా ఒలింపిక్ క్రీడాకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న నల్లా మాస్టారును జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన పీడీలు, పీఈటీలు, ఒలింపిక్ క్రీడాకారులు సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ గౌరవాధ్యక్షుడు అల్లాడ సత్తిబాబు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, భాస్కరదొర పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



అంబాజీపేట పీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తుపాన్ల ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల వైరల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. ప్రజలు కాచిన నీటినే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలపై గ్రామాల్లో సర్వే నిర్వహించి ప్రజలకు తగిన సూచనలు చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు పితాని వీరాస్వామి, నాగాబత్తుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ముంచెత్తుతున్న వరద

- నీట మునిగిన కనకాయలంక కాజ్ వే
- ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

మామిడికుదురు: ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరడం, గోదావరి వరద అంతకంతకూ పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ఉన్న కాజ్‌వేను వరద నీరు చుట్టుముట్టింది. కాజ్‌వేకు ఇరువైపులా ఉన్న ఇటుక బట్టీలు ముంపుబారిన పడ్డాయి. కాజ్‌వే ఏ క్షణంలో అయినా ముంపుబారిన పడే అవకాశం ఉండడంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు కలవర పడుతున్నారు. కాజ్‌వే మునిగిపోతే సదరు మూడు గ్రామాల ప్రజల రాకపోకలకు ఆస్కారం ఉండదు. పాశర్లపూడి బాడవలో వైనతేయ వారధి వద్ద గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది. అక్కడ కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలోకి వరద నీరు ప్రవేశించింది. పెదపట్నం మధ్యలంకలో పశువులు ఉండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు రైతులు సిద్ధమయ్యారు. పాశర్లపూడి, పాశర్లపూడిలంక మత్స్యకార ప్రాంతాల్లోనూ వరద తీవ్ర ప్రభావం చూపుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరద పరిస్థితిని సమీక్షించిన ఆర్డీఓ

గోదావరి వరద పరిస్థితిని అమలాపురం ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి గురువారం సమీక్షించారు. ఆయన పాశర్లపూడిలంక శ్రీరామ్‌పేటలో పర్యటించి అక్కడి మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా వైనతేయ గోదావరి నదీ తీరంలో నివసిస్తున్న మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మృత్యుంజయరావు, సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఆర్ఐ అలీ, వీఆర్వో ఆర్‌వీఎస్ఎస్ రాయుడు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో కోనసీమలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్ వే గురువారం ఉదయం నీట మునిగింది. కాజ్ వేపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడ పడవలను ఏర్పాటు చేశారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిలంక, బూరుగులంక, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపై ప్రయాణిస్తున్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బూరుగులంక రేవును పరిశీలించారు. లంక గ్రామాల ప్రజలతో మాట్లాడి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లంక గ్రామాల్లో తహసీల్దార్ శ్రీపల్లవి పర్యటించారు.



పాశర్లపూడిలంక శ్రీరామ్‌పేటలో వరద పరిస్థితిపై సమీక్షిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్ రెడ్డి



అప్పనపల్లిలో గరుత్మంతుడి విగ్రహాన్ని చుట్టుముట్టిన వరద

ఇంటింటా జ్వర పీడితులపై సర్వే

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు గురువారం అప్పనపల్లి గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా ర్యాపిడ్ కిట్లతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి ప్రజలకు తగిన సూచనలు, సలహాలు అందించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ముంపు నీరు ఇళ్ల వద్ద నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పీ జి.నిఖిత, ఎంపీహెచ్ఏ జి.యజ్ఞేశ్వరరావు, ఏఎన్ఎంలు జి.శ్రీదేవి, జి.సంతోషి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ఇంటింటా ఫీవర్ సర్వేలో పాల్గొన్న డాక్టర్ ప్రశాంత్

ప్రశాంత వాతావరణంలో వేడుక నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ గణపతి నవరాత్ర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గణపతి ఉత్సవ నిర్వాహకులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ గణపతి పందిర్ల వద్ద ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లైటింగ్, సౌండ్ సిస్టమ్, తాగునీరు తదితర అంశాలపై తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.చిరంజీవి మాట్లాడుతూ గణపతి నవరాత్రులకు సంబంధించి సింగిల్ విండో సిస్టమ్ ద్వారా కమిటీ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా నవరాత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.సరోవర్, ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం అధ్యాపకుల ఆందోళన



జీతాల కోసం రాధాకృష్ణన్ చిత్రపటానికి వినతి పత్రం ఇస్తున్న అధ్యాపకులు

మలికిపురం: మలికిపురం ఎంవీఎన్ జేఎస్అండ్‌ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని గురువారం ఆందోళనకు దిగారు. జీతాల కోసం అడిగితే జీతాల కోసం పని చేయొద్దని కళాశాల కరస్పాండెంట్ మొండిగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నిరసన వ్యక్తం చేస్తూ కళాశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వినతి పత్రం అందించారు. అనంతరం కరస్పాండెంట్ సత్యనారాయణమూర్తికి కూడా వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.రమేష్‌బాబు, రొక్కాల వెంకట్, రహేల్ బాబు తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు.

అడవిపాలెంలో ఉద్రిక్తత



ఆందోళన చేస్తున్న ఎస్సీ సంఘ నాయకులతో చర్చిస్తున్న ఎస్సై సురేష్

మలికిపురం: అడవిపాలెం గ్రామంలో గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ గ్రామంలో ఒక స్థల విషయమై తలెత్తిన వివాదం ఆందోళనకు దారితీసింది. రెండు వర్గాలుగా విడిపోగా, పోలీసులు రంగ ప్రవేశం చేసి వివాదం పరిష్కారానికి కమిటీ వేశారు. ఆ వివరాలు ఇలా.. ఐదేళ్ల కిందట ఏర్పడిన అడవిపాలెం పంచాయతీ తాత్కాలిక కార్యాలయం ఎస్సీ కమ్యూనిటీ భవనంలో నడుస్తోంది. ఆ భవనం ఉన్న స్థలం పంచాయతీదని పాలకవర్గం ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు గురువారం సర్వేకు వచ్చారు. అది పంచాయతీ స్థలం కాదని ఎస్సీ సంఘానిదని పేర్కొంటూ గ్రామ ఎస్సీ సంఘం ఆందోళనకు దిగింది. జనం మోహరించడంతో సర్వే నిలిపివేసిన అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. రాజోలు సీఐ టీవీ నగేష్‌కుమార్, మలికిపురం ఎస్సై పీవీవీఎస్ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరుపక్షాలతో వేర్వేరుగా వారు చర్చలు జరిపి అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సై సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం తలపెట్టిన సర్వే నిలిపి వేయించామన్నారు. తదుపరి మరో సమావేశం ఏర్పాటు చేసి వివాదం పరిష్కారానికి ఇరు పక్షాలతో మాట్లాడతామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. మందపల్లి మందేశ్వరస్వామి దేవస్థానం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 41 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.15,07,116 లభించిందని విఘ్నేశ్వర స్వామివారి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. ఇంకా 12 విదేశీ నోట్లు లభించాయన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాలతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపేట: ప్రతిఒక్కరూ పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి(సీడీపీఓ) పి.శారద అన్నారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అవిడి గ్రామం శివాలయం వద్ద మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శారద మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పండ్లలో పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



అంబాజీపేటలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ పిలుపునిచ్చారు. అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మట్టి వినాయకులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయ ప్రతిమతో పూజలు చేసి కాలుష్యాన్ని నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపీడీఓ జి.సరోవర్, సూదాబత్తుల రాము, మైలా ఆనందరావు, పితాని వీరాస్వామి, చిన్నం బాలవిజయరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మామిడికుదురు: ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టితో స్వయంగా వినాయకుని బొమ్మలు తయారు చేశారు. గురువారం పాఠశాల హెచ్ఎం జి.సాయిబాబు ఆధ్వర్యంలో డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో మట్టి బొమ్మలను తయారు చేసి ప్రదర్శించారు. పెదపట్నంలంకకు చెందిన రైల్వే ఉద్యోగి యేడిద రాజేష్, అతని స్నేహితులు అదే గ్రామంలో మట్టితో తయారు చేసిన 500 వినాయకుని బొమ్మలను ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య చేతుల మీదుగా భక్తులకు ఉచితంగా అందజేశారు.

మట్టి వినాయకుల ప్రతిమల పంపిణీ

రావులపాలెం: పర్యావరణ పరిరక్షణకు గురువారం అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చింతా లావణ్య కుమార్ సౌజన్యంతో రావులపాలెంలో మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. రావులపాలెం కేఎస్ఆర్ టెంట్ హౌస్ అధినేత కాశిరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ కృష్ణ, ఉపాధ్యాయుడు చింతా శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

గురువులే మార్గదర్శకులు



తాటిపాకలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: నవ సమాజ నిర్మాణానికి గురువులే మార్గదర్శకులని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం తాటిపాకలో ఆయన స్వగృహం వద్ద గురుపూజోత్సవం నిర్వహించి రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎస్.ప్రభాకరరావు, ఉపాధ్యాయులు జీవీఎల్ శ్రీనివాస్, కేవీఆర్ గోపాలకృష్ణ, కె.జాన్‌ప్రసాద్, వి.విజయనిర్మల తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో..

మలికిపురం: గురు పూజోత్సవం సందర్భంగా గురువారం స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పూర్వపు ప్రిన్సిపల్స్ గోదశి స్వామినాయుడు, ఆచంట ఆదినారాయణలను ఘనంగా సత్కరించారు.

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దివ్వి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కడలి సాయిరామ్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సాయిరామ్, ఉపాధ్యాయులు బొక్కా వెంకటేశ్వరరావును విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతా మహాలక్ష్మి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ పి.సుబ్బరాజు ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.